ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆటోలు నడుపుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

లింగోజిగూడ: పోలీస్ అధికారుల సూచనలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కల్గించకుండా సెవెన్ సీటర్ ఆటోలను నడుపుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. ఎల్బీనగర్ సెవెన్ సీటర్ ఆటో వెల్ఫేర్ అసోసియేషన్, ట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఆయన ఎల్బీనగర్, సంతోష్‌నగర్ పోలీస్ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నగరంలోని రోడ్లపై రోజురోజుకూ వాయు, శబ్ద కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి కేటాయించాలని ఆయన సూచించారు. ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు కూడా ఒకసారి ట్రాఫిక్ పోలీసు అధికారులతో మాట్లాడి ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా సహకరించాలన్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటివి చేయొద్దన్నారు. సెవెన్ సీటర్ ఆటో అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రయాణికులు ఎవరూ తమ ఆటోలు ఎక్కడం లేదని, ఒకవేళ కిరాయి దొరికి రోడ్లపైకి వెళ్తే పోలీసులు చలాన్లు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల తమ జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, నగరంలోకి పగటిపూట ట్రాక్టర్ నో ఎంట్రీ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. సెవెన్ సీటర్ ఆటోలు, ట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, ఎల్బీనగర్, సంతోస్‌నగర్ ట్రాఫిక్ ఏసీపీలు నవీన్ రెడ్డి, సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐలు నర్సింగ్ రావు, నర్సింహ నాయక్, సెవెన్ సీటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతు యాదవ్, ఉపాధ్యక్షుడు చాంద్ పాషా, ట్రాక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు దుర్గయ్య, అశోక్, అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీసీ డిప్యూటీ కమిషనర్ అరుణకుమార్, కార్పొరేటర్ ప్రేమ్, అధికారులు

చైతన్యపురి: రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేసే వారి వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్న దృష్ట్యా బుధవారం గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ (డీసీ) అరుణ కుమారి, జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు, వీధి వ్యాపారుల కమిటీ సభ్యులతో ఏర్పాటైన ఈ సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ, దిల్‌సుఖ్‌నగర్ కోణార్క్ థియేటర్ రోడ్డులో రహదారి నంతా తోపుడు బండ్ల వ్యాపారులు ఆక్రమించుకోవటం వల్ల పలు కాలనీలకు రాకపోకలకు ఇబ్బందుల కలుగుతున్నాయన్నారు. రోడ్లపై కూరగాయలు పారవేస్తున్న వారిపై శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. అక్రమంగా రోడ్లను ఆక్రమించుకోవటం వల్ల అంబులెన్స్‌లు కూడా పోలేని పరిస్థితి నెలకొందన్నారు. ట్రాఫిక్ పోలీస్, జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయంతో సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఖాళీ ప్రదేశంలో స్ట్రీట్ వెండర్స్ జోన్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉంటాయని, ఈ విషయంపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో ట్రాఫిక్ సీఐ నరసింహ, ప్రాజెక్ట్ ఆఫీసర్ విక్రమ్‌రెడ్డి, యూసీడి సైదులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి



గుడిసెవాసులతో సమావేశమైన మోతీలాల్ నాయక్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని ప్రభుత్వ భూమిలో 30 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పరుచుకొని జీవిస్తున్న గుడిసెవాసులకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ కోరారు. బుధవారం సింగరేణి కాలనీ రోడ్ నం.12లోని కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన గుడిసెవాసుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింగరేణి కాలనీలో నివసించే నిరుపేద దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ వర్గాల వారందరికీ ప్రభుత్వాలు మంజూరు చేసిన ఆధార్, ఓటరు కార్డులతో పాటు అన్ని ధృవపత్రాలు ఉన్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగరేణి కాలనీలో గుడిసెవాసులకు వాంబే గృహాలు నిర్మించి ఇచ్చారని తెలిపారు. గతంలోనూ రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి పట్టాలు ఇస్తామని చెప్పారన్నారు. అయితే ఇటీవల ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ హౌసింగ్ సొసైటీ సభ్యుల పేరుతో ఇది ప్రైవేట్ భూమి అని అధికారులకు, ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ విషయంలో స్పందించక పోతే సింగరేణి కాలనీలోని 2 వేల గుడిసెవాసులతా కుటుంబసభ్యులతో ప్రజాభవన్‌కు వెళ్లి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. సమావేశంలో సింగరేణి కాలనీ నాయకులు తుకారాం, షేక్ మహమూద్, విక్రం, సక్రిబాయ్, ఏలూరు బాబు, బస్సీనాయక్, సద్దాంఖాన్, ఇబ్రహీం, చందూ నాయక్ పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా

చైతన్యపురి: డివిజన్ పరిధిలోని గణేష్‌పురి కాలనీలో స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా బుధవారం అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అవసరమైన ప్రాంతాల్లో నూతన డ్రైనేజీ, వరదనీటి లైన్ నిర్మాణం, రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలని కార్పొరేటర్ జీహెచ్ఎంసీ ఏఈ పార్వతిని కోరారు. కాలనీల్లో సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఇన్‌చార్జి శ్రీకాంత్, జవాన్ మహేష్, అజయ్ సత్యం, కాలనీవాసులు కృష్ణగౌడ్, యాదన్న, అశోక్, జైహింద్, లక్ష్మారెడ్డి, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మంత్రి పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న రజక గోపి

కాచిగూడ: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసే విధంగా కృషి చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోపి రజక కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రజక కులస్తుల స్థితిగతులపై... సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షత గురించి ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులపై అసెంబ్లీలో మాట్లాడి రజకులకు న్యాయం చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో రజక కుస్తుల సంక్షేమ పథకాల ప్రస్తావనతో పాటు ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అసెంబ్లీలో మాట్లాడిన వీడియోను మంత్రికి అందజేశారు. రజక రిజర్వేషన్ సమితి అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగ్‌రావు, బేగంపేట నర్సింహ, కొండ్రాతి రమేష్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' ఇంటింటి సర్వే షురూ

- 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులే అర్హులు
- తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ సేకరణ
- చంపాపేట, సరూర్‌నగర్ డివిజన్లలో 4.60లక్షల కనెక్షన్లు



విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఎల్బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి పథకం అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చంపాపేట, సరూర్‌నగర్ డివిజన్లలో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. 200 యూనిట్ల మేర విద్యుత్ ఖర్చు చేసే వినియోగదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను విద్యుత్ శాఖ రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వారం రోజుల్లో ఈ వివరాల సేకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సిబ్బంది ఆగమేఘాలతో వివరాలను సేకరిస్తున్నారు.

రెండు డివిజన్లలో 4.60 లక్షల కనెక్షన్లు..

ఎల్బీనగర్ నియోజకర్గంలో చంపాపేట, సరూర్‌నగర్ రెండు డివిజన్లలో సుమారుగా 4.60 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ అధికారులు, స్పాట్ బిల్లు సేకరించే సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ మీటర్ నెంబర్‌కు సంబంధించిన వినియోగదారుల వివరాలను సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, ఫోన్ నెంబర్ సేకరిస్తున్నారు. విద్యుత్ బిల్లులు తీసే మీటర్ రీడింగ్‌లో సైతం ఆ వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెల 15 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేందు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అద్దె ఇంట్లో ఉన్నా అర్హులే..

అద్దె ఇంట్లో ఉండేవారు కూడా గృహజ్యోతి పథకానికి అర్హులేని అధికారులు స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎక్కువ సంఖ్యలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగ లేక చాలా మంది నగరానికి వలస వచ్చి వివిధ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అద్దె ఇంట్లో ఉంటున్న వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. గృహజ్యోతికి అద్దె ఇంట్లో ఉన్నవారు కూడా అర్హులే అని తేలడంతో చాలా మంది పేదలకు ఈ పథకం ఆర్థికఊరట ఇవ్వనుంది.

వివరాలు అప్‌లోడ్ చేస్తున్నాం

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చంపాపేట, సరూర్‌నగర్ రెండు డివిజన్లలో సుమారు 4.60లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను సేకరిస్తూ అప్‌లోడ్ చేస్తున్నాం. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నాం. ఈ వివరాలను ప్రభుత్వానికి పంపిస్తాం.

– సురేష్, రామకృష్ణ, చంపాపేట, సరూర్‌నగర్ డీఈలు

మంచినీటి సరఫరా ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని శ్రీ బాలాజీ టౌన్‌షిప్ కాలనీలో బుధవారం బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతారెడ్డి మంచినీటి సరఫరాను ప్రారంభించారు. ఇంటింటికీ తాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు మనోహర్, ప్రభాకర్‌రెడ్డి, నేనావత్ బాలు, జైహింద్, రాజేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల కూల్చివేత



లెక్చరర్స్ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్ కాలనీలోని రోడ్డు నంబర్-5లో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చి వేశారు.. ఏసీపీ పావని ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేత నిర్వహించారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టారని స్థానికులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు.

అభినందనలు



వనస్థలిపురం పోలీసు స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను బుధవారం తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డప్పు వినోద్‌కుమార్, రాష్ట్ర కురుమ సంఘం నాయకుడు మైల శ్రీనివాస్ కలిశారు. సీఐను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. – నాగోలు

యాకుత్‌పురా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



థీమ్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెరాజ్ హుస్సేన్, కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్

సైదాబాద్: ప్రణాళికాబద్ధంగా యాకుత్‌పురా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ అన్నారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీలక్ష్మీనగర్ కాలనీలో రూ. 2కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీ జనరేషన్ థీమ్ పార్కును ఆయన కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీలక్ష్మీనగర్ కాలనీలో అన్ని హంగులతో ఏర్పాటు చేసిన థీమ్ పార్కును కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. త్వరలో ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కార్పొరేటర్‌తో కలిసి పర్యటిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పరిసర కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ ప్రాంతంలోని సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీ నాగమణి, యూసీబీ డీడీ అమీనాబి, సర్కిల్ మేనేజర్ యమున, జంగం మధుకర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రవీందర్‌రెడ్డి, బాలకృష్ణగౌడ్, ప్రఫుల్‌కుమార్ పాల్గొన్నారు.

చదువుతో సమాజంలో మంచి గుర్తింపు



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌లోని మలక్‌పేట గవర్నమెంట్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఎంవీఎఫ్ నేషనల్ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి, సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎండీ. ఇస్మాయిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, సకల సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. చదువుతో సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీధర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మ్యాథ్స్ టీచర్ పద్మప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలరాముని దర్శనానికి బీజేపీ నాయకులు



అయోధ్య బయలుదేరిన ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభించిన సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: అయోధ్యలోని భవ్య రామమందిరంలో కొలువుదీరిన బాలరాముని దర్శనంతో మన మనసు, శరీరం ఆధ్యాత్మికతను సంతరించుకుంటుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 1400 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అయోధ్యలోని రామమందిర దర్శనాని ప్రత్యేక రైల్‌లో బయలుదేరారు. నగరం నుంచి బయలుదేరిన ఈ ప్రత్యేకు రైలును సురేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ నాయకుల అయోధ్య యాత్ర శుభప్రదం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, అట్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులేవీ?

- ఆహ్లాదం పేరుతో ఆక్రమణలు
- చెరువుల స్థలాల కబ్జా
- రూ.4 కోట్లు మంజూరైనా ప్రారంభం కాని అభివృద్ధి పనులు
- పట్టించుకోని అధికారులు



నిలిచిపోయిన అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు సుందరీకరణ పనులు

బడంగ్‌పేట్: చెరువుల సుందరీకరణ పేరుతో కొంతమంది నాయకులు, అధికారులు రూ.కోట్లలో ప్రజాధనం కొల్లగొట్టారు. చెరువులను కుదిస్తూ కబ్జాలు చేశారు. ఊరిని కాపాడిన చెరువులను కుంటలుగా మార్చేసిన ఘనత వీరికే చెల్లిందని ప్రజలు మండిపడుతున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో కోమటికుంట, పోచమ్మకుంట చెరువులు ఉన్నాయి. వీటిని సుందరీకరించి, చుట్టు పక్క ప్రాంతాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని గత ప్రభుత్వం పేర్కొంది. ఇందు కోసం రూ.4 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులు మాత్రం కార్యాచరణ దాల్చలేదు. చెరువుల సుందరీకరణ కోసం చదును చేసిన భూములను ఆక్రమించిన కొందరు నేతలు వీటిని ప్లాట్లుగా చేసి అమ్ముకోవడం మొదలు పెట్టారు. ఈ విషయంలో ఇరిగేషన్, కార్పొరేషన్ అధికారులు వీరికి సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పి చెరువుల మధ్యలో అడ్డంగా మట్టిని పోసి చెరువులను కబ్జా చేసే ప్రయత్నాలు చేశారు. దాదాపు 20కి పైగా కాలనీల డ్రైనేజీ పైపులను చెరువుల్లోకి మళ్లించారు. సుందరీకరణ పేరుతో వేసిన వాకింగ్ ట్రాక్, చెరువుపై వేసిన కట్టల వల్ల మురుగునీరు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దీంతో రోజుల తరబడి రోడ్లపైనే పారుతోంది. ఇదిలా ఉండగా చెరువుల కోసం మంజూరైన నిధులు పక్కదారి పట్టాయి.

కట్టలను తొలగిస్తాం..

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అల్మాస్‌గూడలోని కోమటికుంట, పోచమ్మకుంట చెరువులను సందర్శించారు. నాలుగేళ్లుగా సుందరీకరణ పేరుతో చెరువులను నిర్లక్ష్యం చేశారన్నారు. చెరువులను కుదించి, కబ్జాలకు గురిచేశారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రూ.కోట్లు కాజేసిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువులకు అడ్డంగా కట్టిన కట్టలను కూడా తొలగిస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో గురువారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

◆ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు... ఆటో మీటర్ సీల్ ఆఫీస్, సింగరేణి కాలనీ పార్క్, ఆదర్శ్‌నగర్ నాలా, సరస్వతీ శిశుమందిర్, సరూర్‌నగర్ చెరువు కట్ట, సింగరేణి కాలనీ గార్డు పీటీ పరిసర ప్రాంతాలు.

◆ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు... శంకేశ్వరబజార్, సరస్వతీ నగర్, కోదండరాం నగర్, సాహితీనగర్, సన్‌షైన్ కాలనీ పరిసర ప్రాంతాలు.

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తా..



అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని అన్ని కాలనీల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, కాలనీల ప్రజలు తమ అవసరాలను తన దృష్టికి తేవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని సాయి కాలనీ ఫేజ్-2 లో అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని చాలా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక జనం ఇబ్బంది పడుతున్నారని, ఆయా కాలనీల్లో ఒక్కొక్కటిగా డ్రైనేజీలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 21, వంకాయ 15, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 23, క్యారెట్ 22, దొండ 45, ఆలు 23, ఉల్లి 19, గోకర 50, దోస 19, సొర 11, పొట్ల 13, అరటి 09, చిక్కుడు 35, అర్వి 60, మునగ 75, చిలగడదుంప 60, బీట్‌రూట్ 21, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశానికి హాజరైన డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజునీస్సా

మలక్‌పేట: ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవ నిర్వహణపై బుధవారం సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పక వేయాలని సూచించారు. మలక్‌పేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజునీస్సా నులిపురుల నివారణ మాత్రలు వాడకంపై పాఠశాలల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ తరుణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే బూత్ అభియాన్

కాచిగూడ: బూత్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.నందకిషోర్ యాదవ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు నందకిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం గోల్నాక డివిజన్ బూత్ నెంబర్ 103 జైస్వాల్ గార్డెన్‌లో బీజేపీ నేతలు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బూత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. బీజేపీ నేతలు రవీందర్ గౌడ్, ఆర్.ప్రవీణ్, శ్రీధర్, జ్యోతి, ఎం.శ్రీనివాస్ రెడ్డి, రామన్ గౌడ్, కె.ఉపేందర్, శ్రీనివాస్, భాస్కర్ యాదవ్, ఎస్.ఎస్.రాము పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కాచిగూడ: కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో పయనించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు బూత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాచిగూడ డివిజన్‌లోని పలు బూత్‌లలో ఆమె పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటికీ ప్రచారం చేశారు. బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌లో గుర్తుతెలియని మహిళ మృతి



కాచిగూడ: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య సమాచారం మేరకు... గుర్తుతెలియని మహిళ(60) ఎంఎంటీఎస్ రైలు కోచ్‌లో మరణించి ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.